# నాడు పడీత్ భూములు.. నేడు పంట పొలాలు

- లీకేజీ నీళ్లు అడుక్కునే అవసరం లేకుండా చేశా..
- వరద, కాకతీయ కాలువల్లో 365 రోజులు నీళ్లు
- ముస్లింల అభ్యున్నతికి కాంగ్రెస్, బీజేపీ దూరం
- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల
- మోర్తాడ్, మెండోరా మండలాల్లో ఎన్నికల ప్రచారం



మెండోరాలో వేముల ప్రసంగం వింటున్న గ్రామస్తులు



తిమ్మాపూర్‌లో వేములకు గొర్రె పిల్లను బహూకరించిన గ్రామస్తులు

మోర్తాడ్, నవంబర్ 17: వరదకాలువ, కాకతీయ కాలువ, పెద్ద వాగులో చెక్‌డ్యాంల నిర్మాణంతో మోర్తాడ్ మండలంలోని పాలెం, తిమ్మాపూర్ గ్రామాలకు సాగునీటి ఇబ్బందులు దూరమైనట్లు బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పదేండ్ల క్రితం వరకు బీడుభూములుగా ఉన్న భూములన్నీ సాగుభూములుగా మారాయన్నారు. ఇప్పుడు పాలెం, తిమ్మాపూర్ శివారుల్లో ఎటు చూసినా పంటపొలాలే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు లీకేజీ వా టర్ అడుక్కునే పరిస్థితులు ఉండేవని, రాష్ట్రం వచ్చాక రైతుల పరిస్థితులను గమనించి కేవలం రెండేండ్లలోనే లీకేజీ నీటిని అడుక్కునే దుస్థితి లేకుండా చేశామన్నారు. 365 రోజులు వరద కాలువ, కాకతీయకాలువలో నీళ్లు ఉండేలా చేశామన్నారు. శుక్రవారం ఆయన మోర్తాడ్, మెండోరా మండలాల్లో పర్యటించారు. ఉదయం మోర్తాడ్ మండలం తిమ్మాపూర్, పాలెం, మోర్తాడ్, సాయంత్రం మెండోరా మండలం కొడిచెర్ల, మెండోరా, పోచంపాడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ గ్రామాల్లో యువకులు బైక్‌ర్యాలీ, డ్యాన్సులతో స్వాగతం పలకగా, మహిళలు బోనాలు, మత్స్యకార్మికులు వలగొడుగులతో మంత్రి వేములకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా వేముల మాట్లాడుతూ.. గతంలో చుక్క సాగునీరు లేక బాధపడ్డ రైతులు ఎస్సారెస్పీ లీకేజీ వాటర్ కోసం తనను సైతం కోపగించుకున్నారని గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రాజెక్టులో నీళ్లు లేక లీకేజీ వాటర్‌ను అందించలేని పరిస్థితి ఉండేదని, ఆనాడే తాను రైతులకు మాట ఇచ్చానని తెలిపారు.365రోజులు సాగునీటిని అందుబాటులో ఉంచుతానని మాట ఇచ్చిన ప్రకారం కాళేశ్వరం జలాలను రివర్స్ పంపింగ్‌తో వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీని నింపినట్లు తెలిపారు. 70 ఏండ్ల పాలనలో బీజేపీ, కాంగ్రెస్‌లు కరెంటు, తాగునీరు ఎందుకివ్వలేదో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్సారెస్పీ నుంచి నీటిని శుద్ధి చేసి ఇంటింటికీ ఫిల్టర్ నీటిని మిషన్‌భగీరథ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. పాలెం, తిమ్మాపూర్ గ్రామాల్లో రూ.130కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో ఆలోచించాలన్నారు. జరిగిన అభివృద్ధి అంతా కండ్ల ముందే కనిపిస్తుందని చెప్పారు. దేశంలో నాలుగు రాష్ర్టాల్లో కాంగ్రెస్, 18 రాష్ర్టాల్లో బీజేపీ అధికారంలో ఉన్నాయని ఆ రాష్ర్టాల్లో తెలంగాణలో అమలవుతున్న 24గంటల ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. అక్కడ పింఛన్ కేవలం రూ.750 నుంచి వేయిరూపాయల వరకు మాత్రమే ఉన్నాయని చెప్పారు. పక్కనే ఉన్న రాష్ర్టాలకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వెళ్లి చూసి రావాలని సూచించారు. ఇక్కడ అమలవుతున్న పథకాలు అక్కడ లేనట్లయితే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా తనకే ఓటు వేయడం న్యాయమన్నారు.

**బీజేపీ, కాంగ్రెస్‌తో ముస్లింలకు ఒరిగిందేమీలేదు..**

కాంగ్రెస్ పార్టీ ఆర్ఎస్ఎస్, బీజేపీల పేర్లు చెప్పి ముస్లింల ఓట్లు రాబట్టే ప్రయత్నం చేస్తుందని, ఈ రెండు పార్టీలతో మైనార్టీలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో హైదరాబాద్‌లో మాటిమాటికీ కర్ఫ్యూలు ఉండే పరిస్థితి ఎందుకొచ్చిందో ఆలోచించాలన్నారు. కానీ తెలంగాణ సాధించుకున్నాక రాష్ట్రంలో శాంతియుత వాతావరణ నెలకొందని చెప్పారు. అభివృద్ధి చేసే విషయంలో ఎక్కడ కూడా రాజీపడలేదన్నారు. తారురోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, సాగు, తాగునీటి కష్టాలను దూరం చేశామన్నారు. ఓటు అనేది అతి విలువైనదని, ఆషామాషీగా వేసేది కాదని అభ్యర్థి ఏం చేశాడు, మనం వేసే ఓటు అభ్యర్థికి సంబంధించిన పార్టీ మనకేం చేసిందో ఆలోచించి వేయాలని సూచించారు. ఆనాడు ఏం చేయని వారు ఈరోజు ఏమో చేస్తామని వచ్చి చెప్పితే మోసపోవద్దన్నారు. ప్రచార కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నర్సింహనాయుడు, ఎంపీపీ శివలింగుశ్రీనివాస్, జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచులు గడ్డం చిన్నారెడ్డి, సంతోష్, బోగ ధరణి ఆనంద్, ఎంపీటీసీలు అస్మా అజారుద్దీన్, రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

**వేములకు ఏకగ్రీవ తీర్మాన కాపీ అందజేత**

వేల్పూర్, నవంబర్ 17 : వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా భీమ్‌గల్ మత్స్యకారులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీని వేల్పూర్ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గూండ్ల గంగపుత్ర సం ఘం సభ్యులు అశోక్, సురేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**నేడు మంత్రి వేముల ఎన్నికల ప్రచార షెడ్యూల్**

రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం ముప్కాల్, ఏర్గట్ల మండలాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ముప్కాల్ మండలం వేంపల్లి, 10.30 గంటలకు కొత్తపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు నల్లూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు ఏర్గట్ల మండలం బట్టాపూర్, 6 గంటలకు తడ్‌పాకల్, 7.30 గంటలకు ఏర్గట్ల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

## వ్యవసాయంపై అవగాహన లేని రేవంత్‌రెడ్డి



కొడిచెర్లలో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి


మెండోరా, నవంబర్ 17 : పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి రైతులు, వ్యవసాయంపై అవగాహన లేదని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం మెండోరా మండలం కొడిచెర్ల, మెండోరా, పోచంపాడ్‌లో ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పది హర్స్‌పవర్ పంపు సెట్లతో నీటిని పారించుకోవడమంటూ కొత్త పాట మొదలెట్టాడన్నారు. రేవంత్ కొత్త పాటపై అందరూ ఎద్దేవా చేస్తూ నవ్వుకుంటున్నారన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



భీమ్‌గల్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, కౌన్సిలర్లు

భీమ్‌గల్/ బాల్కొండ/ నవంబర్ 17: బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గడప గడపకూ వెళ్లి కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, మహిళా కౌన్సిలర్లతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బాల్కొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో 14వ బూత్ సభ్యులు హాస్టల్ రియాజ్, కన్న పోశెట్టి, రాజేశ్వర్, జంగం అబ్దుల్, ముజీబ్, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



బాల్కొండలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఓటరు స్లిప్పుల పంపిణీ



మెండోరాలో ఓటరు స్లిప్పులను అందజేస్తున్న అధికారులు

మెండోరా/ ముప్కాల్, నవంబర్ 17: మెండోరా మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. బీఎల్వోలు, రెవెన్యూశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో ఇం టింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను అందజేసి, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఎల్వోలు ఓటరు స్లి ప్పులను పంపిణీ చేశారు. బీఎల్వోలు జ్యోతి, అమీనా బేగం, వాణి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య శిబిరం

బాల్కొండ, నవంబర్ 17 : మండలంలోని కిసాన్ నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ ఆరోగ్యాధికారి మురళి, పాఠశాల అధికారిణి జ్యోతి, ఆరోగ్య విస్తీర్ణాధికారి ఆడెపు ప్రభాకర్, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, రాజు, శాలిని, ఆశ కార్యకర్త గంగామణి పాల్గొన్నారు.

## వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 17: గులాబీ పార్టీలో వలసలు జోరందుకున్నాయి. మండలంలోని రామన్నపేట్ గ్రామ మాజీ సర్పంచ్ సోము సాయన్న, కార్యకర్తలు, మోతెకాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సాయిరాం, సీనియర్ నాయకులు మల్కన్న, అంక్సాపూర్ నుంచి జక్కుల సంతోష్ ఆధ్వర్యంలో 15 మంది యువకులు, లక్కోరా నుంచి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ విశ్వబ్రాహ్మణ యువజన సంఘం సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలోని వివిధ యువజన సంఘాల సభ్యులు గులాబీ గూటికి చేరారు. వారందరికీ మంత్రి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**బాల్కొండ నుంచి..**

బాల్కొండ, నవంబర్ 17 : బాల్కొండ మండల కేంద్రానికి చెందిన నెహ్రూ యూత్, సూర్య యూత్‌లకు చెందిన సుమారు 40 మంది సభ్యులు శుక్రవారం వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### స్థానిక నాయకుల సమక్షంలో..

ఏర్గట్ల/బాల్కొండ, నవంబర్ 17 : ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దన్నే పెద్ద సాయన్నతో పాటు స్థానిక మేదరి సంఘ సభ్యులు ..జడ్పీటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్, ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాల్కొండ మం డలంలోని కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మస్రత్ పాషా శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ మొయిజ్, మైనార్టీ నాయకులు ఇఫ్తేకారోద్దీన్,షేక్ రహీమొద్దీన్, మహ్మద్ అహ్మద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.